# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ లోక్‌సభ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్నారు.**

**2. లోక్‌సభ సభ్యులందరినీ కలుపుకొని వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

**3. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది.**

**4. రాష్ట్ర ఐటీ, విద్యా, ఆర్టీజీ శాఖల మంత్రిగా నారా లోకేష్... గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రిగా కొల్లు రవీంద్ర ఈరోజు బాధ్యతలు చేపట్టారు.**

**5. వర్షాకాలం నేపథ్యంలో డయేరియా ప్రబలే ప్రమాదం ఉన్నందున తగిన జాగ్రత్తలు చేపట్టాలని మున్సిపల్ శాఖా మంత్రి పి. నారాయణ అధికారులను ఆదేశించారు.**

===========================

18వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. నూతన లోక్‌సభకు ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్‌తో ఈరోజు ఉదయం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణం చేయించారు. అనంతరం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్.. సభ్యులతో ప్రమాణస్వీకార కార్యక్రమం చేపట్టారు. లోక్‌సభాపక్ష నేతగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలుత ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం కేంద్రమంత్రులు, ఇతర సభ్యులతో ప్రొటెం స్పీకర్ లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేయిస్తున్నారు. లోక్‌సభ సభ్యులుగా కింజరపు రామ్మోహన్‌నాయుడు, కిషన్ రెడ్డి తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. తొలి రోజు 280 మంది ఎంపీలు ప్రమాణం చేయనున్నారు. మిగిలిన వారితో రేపు ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం స్పీకర్ ఎన్నికకు నామినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఎల్లుండి స్పీకర్ ఎన్నిక పూర్తవుతుంది. 27వ తేదీన రాజ్యసభ కూడా ప్రారంభం కానుంది. అదే రోజు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించనున్నారు.

సభ ప్రారంభం కాగానే ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి, కేరళలోని వయనాడ్ స్థానాల్లో గెలుపొందిన కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ స్థానానికి చేసిన రాజీనామాను ప్రొటెం స్పీకర్ ఆమోదించారు.

---------------------------

లోక్‌సభ సభ్యులందరినీ కలుపుకొని వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాలకు ముందు ప్రధానమంత్రి మీడియాతో మాట్లాడారు. ఇదో అద్భుతమైన రోజు అంటూ కొత్తగా ఎన్నికైన సభ్యులకు స్వాగతం పలికారు. కొత్త పార్లమెంటు భవనంలో తొలిసారి లోక్‌సభ ఎంపీల ప్రమాణ స్వీకారం జరగనుందని ప్రధాని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు విపక్షాలు సహకరించాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరుతూ...

వాయిస్..31 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలపై చర్చిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చేసిన ఐదు సంతకాలపై ఒక్కొక్కటిగా క్యాబినెట్‌లో చర్చ సాగింది. తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. డీఎస్సీ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు క్యాబినెట్ ముందుంచారు. జులై ఒకటి నుంచి ప్రక్రియను ప్రారంభించి డిసెంబర్ 10వ తేదీలోపు 16 వేల 347 పోస్టులను భర్తీ చేసేలా ప్రణాళికను రూపొందించారు.

అనంతరం పింఛన్ల పెంపుపై మంత్రివర్గంలో చర్చించారు. పింఛనును 3 వేల రూపాయల నుంచి 4 వేల రూపాయలకు పెంచే నిర్ణయానికి ఆమోదం తెలిపారు. జులై 1వ తేదీ నుంచి పెంచిన పింఛన్లు అందజేయాలని నిర్ణయించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గత మూడునెలలకు కలిపి వచ్చే నెలలో 7 వేల రూపాయల పింఛను అందనుంది. రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది లబ్ధిదారులకు ఈ మొత్తాలను పంపిణీ చేయనున్నారు.

---------------------------

రాష్ట్ర ఐటీ, విద్యా, ఆర్టీజీ శాఖల మంత్రిగా నారా లోకేశ్ ఈరోజు బాధ్యతలు చేపట్టారు. సచివాలయం నాలుగో బ్లాక్‌లోని తన ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలు దస్త్రాలను ఆయన పరిశీలించారు. మెగా డీఎస్సీ సంబంధిత దస్త్రంపై లోకేశ్ తొలి సంతకం చేశారు.

---------------------------

గనులు, ఎక్సైజ్ శాఖలను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన ఖనిజ సంపద వనరులను ప్రజా శ్రేయస్సు కోసం సద్వినియోగం చేస్తామన్నారు. ఈరోజు ఉదయం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఓఎన్జీసి పెట్రోలియం మైనింగ్ లీజు పునరుద్ధరణ దస్త్రంపై తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ఎక్సైజ్ విధానాన్ని రూపకల్పన చేసి, మద్యం లావాదేవీలు, డిస్టిలరీల నుంచి మద్యం పంపిణీ తదితర కార్యక్రమాలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తామన్నారు. అక్రమ ఇసుక రవాణాను నియంత్రించి, ప్రజావసరాల కనుగుణంగా ఇసుకను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

---------------------------

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 లో దేశవ్యాప్తంగా కొత్తగా 400 శాఖలు ప్రారంభించనున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌బీఐ ఛైర్మన్ దినేష్ కుమార్ ఖారా పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ

137 శాఖలు ప్రారంభించగా, ఇందులో 59 శాఖలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసింది. 2024 మార్చికి దేశవ్యాప్తంగా 22 వేల 542 ఎస్‌బీఐ శాఖలు ఉన్నాయి. అనుబంధ సంస్థల కార్యకలాపాలను మరింత విస్తరించిన తర్వాత, వాటిని ఎక్స్‌చేంజీల్లో నమోదుచేస్తామని దినేష్‌కుమార్ స్పష్టం చేశారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, అమరావతి ఉద్యమ ఆకాంక్షలు నెరవేరడంతో రాజధాని ప్రాంత రైతులు తిరుమలకు ఈరోజు కృతజ్ఞత పాదయాత్ర ప్రారంభించారు. రాజధాని పరిధిలోని వెంకటపాలెంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తిరుమలకు మహిళలు, రైతులు పాదయాత్ర చేపట్టారు. అమరావతి పనులు ప్రారంభమైతే తిరుమల తిరుపతి దేవస్థానం వరకు పాదయాత్రగా వస్తామని ఉద్యమ సమయంలో రైతులు మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మొదలుపెట్టిన పాదయాత్రను తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. 20 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగనుంది.

-------------------------

వర్షాకాలం నేపథ్యంలో డయేరియా ప్రబలే ప్రమాదం ఉందని.. అందుకు తగిన జాగ్రత్తలు చేపట్టాలని మున్సిపల్ శాఖా మంత్రి పి. నారాయణ అధికారులను ఆదేశించారు. విజయవాడ రెల్లి కాలనీలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈరోజు పర్యటించారు. రెల్లి కాలనీలో ప్రజల నుంచి మంత్రి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, ఇతర సమస్యలపై మంత్రి నారాయణకు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివరాలు అందించారు. విజయవాడ వ్యాప్తంగా 12 లక్షల మందికి 187 ఎం.ఎల్.డి. నీటి సరఫరా చేస్తున్నట్లు ఆయన వివరించారు. వర్షాకలం నేపథ్యంలో డయేరియా వచ్చే ప్రమాదం ఉన్నందున.. ఇప్పటి వరకు 600 శాంపిల్స్ పరిశీలించామని.. ఎలాంటి ఇబ్బంది లేదని మంత్రి తెలిపారు. మంచినీటిలో నాణ్యత నిబంధనల ప్రకారం ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. ఓపెన్ డ్రెయిన్ల వద్ద నీరు పొంగడం వల్ల మంచినీటి పైపుల్లో కలిసే ప్రమాదం ఉన్నందున అధికారులకు టెలీ కాన్ఫరెన్స్ పెట్టి సిల్ట్ డ్రైవ్ చేపట్టాలని సూచించామని మంత్రి నారాయణ తెలిపారు.

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు, ఎల్లుండి తన సొంత నియోజకవర్గం చిత్తూరు జిల్లాలోని కుప్పంలో పర్యటించనున్నారు. రేపు మధ్యాహ్నం బెంగళూరు నుంచి కుప్పంకు 12గంటల 30 నిమిషాలకు చేరుకోనున్న ముఖ్యమంత్రి, ఒంటి గంటకు శాంతిపురం మండలం చెల్లిగానిపల్లి, చిన్నారిదొడ్డిపల్లి వద్ద హంద్రీనీవా ప్రాజెక్టు పనులను పరిశీలిస్తారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు కుప్పంకు చేరుకుంటారు. ఎల్లుండి కుప్పంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ప్రజల నుంచి వినతులను చంద్రబాబు స్వీకరిస్తారు.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట మన్ కీ బాత్ కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి మన్ కీ బాత్ కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ లేదా మై గౌవ్ ఫోరమ్, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

-------------------------

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌ను ఈరోజు సాయంత్రం నాలుగు గంటలకు సినీ నిర్మాతలు కలవనున్నారు. హైదరాబాద్ నుంచి గన్నవరం చేరుకున్న సినీ నిర్మాతలు అశ్విని దత్, అల్లు అరవింద్, దగ్గుబాటి సురేష్‌బాబు, ఎర్నేని నవీన్, సుప్రియ యార్లగడ్డ తదితరులకు ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్లో చలనచిత్ర నిర్మాణానికి సంబంధించి పలు సమస్యలపై వీరు ఉప ముఖ్యమంత్రితో చర్చించనున్నారు.

--------------------------

నీట్-యూజీ పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ-సీబీఐ కేసును నమోదు చేసింది. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర విద్యా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పేపర్ లీక్ విషయంలో ప్రమేయం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించింది. ఈ నేపథ్యంలో పరీక్ష సమగ్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు... విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎటువంటి మానసిక స్థితి కలిగి ఉండాలన్న అంశాపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక చర్చా కార్యక్రమం ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

--------------------------

రాష్ట్ర ఐటీ, విద్యా, ఆర్టీజీ శాఖల మంత్రిగా నారా లోకేశ్ ఈరోజు బాధ్యతలు చేపట్టారు. సచివాలయం నాలుగో బ్లాక్‌లోని తన ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలు దస్త్రాలను ఆయన పరిశీలించారు. మెగా డీఎస్సీ సంబంధిత దస్త్రంపై లోకేశ్ తొలి సంతకం చేశారు.

======================